# వైఎస్ఆర్-అన్నమయ్య

వార్త

శుక్రవారం 01 ఆగష్టు 2025


## ప్రజాదర్బార్ కార్యక్రమం

రాయచోటి పట్టణం, జూలై 31 ప్రభాతవార్త



రాష్ట్రంలో ఉన్న రెవిన్యూ సమస్యలును కూటమి ప్రభుత్వం త్వరలోనే పరిష్కారం చేసే దిశగా అడుగులు వేస్తుంది ప్రజాదర్బార్ కార్యక్రమంలో అధికారులకు ఆదేశాలు ఇచ్చిన మంత్రి మండిపల్లి గురువారం రోజు సాయంత్రం రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి రెవెన్యూ మరియు పోలీస్ అధికారులకు ప్రజలకు సకాలంలో రెవిన్యూ సమస్యలను తొందరగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో భాగంగా కొంతమంది అధికారులు, నేతలు మరియు ప్రజలు మంత్రికి పుష్పగుచ్చంతో సత్కరించి సన్మానించారు..

## ఏ ఆర్ టి రోగులకు నాణ్యమైన వైద్యం అందించండి

మదనపల్లి క్రైమ్ జూలై 31 ప్రభాతవార్త.

ఏఆర్టీ రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ భాస్కర్ తెలి ప్రారు. గురువారం మదనపల్లి ఏఆర్పి, ఐసిటిసి, స్వచ్ఛంద సంస్థ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్టి రోగులకు హెపటైటిస్ బి, సి వ్యాక్సిన్లు వేయించాలన్నారు. టార్గెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రాంలో హైరిస్క్ ఉన్న కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఆర్టి మెడికల్ ఆఫీసర్లు మేఘన, హుమయున్ భాష, ఆర్ఆర్ఎస్ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.



# గండికోటకు మహర్దశ



- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- రేపు సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రూ.77.91 కోట్లతో గండికోట పర్యాటక ప్రాజెక్టు శంకుస్థాపనకు సర్వం సిద్ధం
- రూ.165 కోట్ల విలువైన 5 పర్యాటక ప్రాజెక్టులకు సీఎం వర్చువల్ గా శంకుస్థాపన చేస్తారని వెల్లడి
- యునెస్కో గుర్తింపు వచ్చేలా గండికోట, అహోబిలంలను తీర్చిదిద్దుతామని స్పష్టం
- గత ఐదేళ్లలో రాష్ట్ర వారసత్వ సంపదను కాపాడుకోవాలన్న ఇంగిత జ్ఞానం వైకాపా ప్రభుత్వం చేయలేకపోయిందని విమర్శలు
- గండికోట పర్యాటక ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించిన మంత్రి కందుల దుర్గేష్..
- మంత్రి దుర్గేష్ కు కడప ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం పలికిన జిల్లా జనసైనికులు
- మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక శ్రద్ధతో పర్యాటకం పరుగులు పెడుతుందని జిల్లా ఇంచార్జ్ మంత్రి సవిత ప్రశంసలు

జమ్మలమడుగు, జూలై 31 ప్రభాతవార్త

గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియాగా పిలిచే గండికోట వారసత్వ సంపదకు మహర్దశ రానుందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గురువారం వైఎస్సార్ కడప జిల్లా గండికోటకు వెళ్లిన మంత్రి కందుల దుర్గేష్ టూరిజం ఎండీ ఆమ్రపాలి కాటతో కలిసి సభాస్థలితో పాటు గండికోటలోని జుమ్మా మసీదు, ధాన్యాగారం, పెన్నాలోయ వ్యూ పాయింట్, ఎర్రకోనేరు, మాధవ రాయస్వామి, రంగనాథ ఆలయాలు, పావురాల గోపురం, మందుగుండు సామాగ్రి గిడ్డంగి, మీనార్లు, జైలు, రంగ్ మహల్ రోప్ వే పాయింట్, గుర్రపు శాలల ప్రదేశాలన్నింటికి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ గండికోటలోని అడ్వెంచర్ స్పోర్ట్ అకాడమీలో స్థానిక మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ శాస్కి స్కీమ్ ద్వారా మంజూరైన రూ.77.91 కోట్లతో గండికోట పర్యాటక ప్రాజెక్టు పనులకు సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా వచ్చి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.165 కోట్ల విలువైన 5 పర్యాటక ప్రాజెక్టులకు సీఎం వర్చువల్ గా శంకుస్థాపన చేస్తారని వివరించారు. అందులో భాగంగా రూ.29.87 కోట్లతో బొర్రా గుహల సుందరీకరణ, లైటింగ్ పనులు, పాత్ వే, ఎమినిటీస్ సెంటర్లు, ఇతర సౌకర్యాలు, బుద్ధిజంను విశ్వవ్యాప్తం చేసిన పల్నాడు జిల్లా నాగార్జున సాగర్ ప్రాంతంలో ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్ మెంట్ (సీబీడీడీ) క్రింద రూ.25 కోట్లతో చేపట్టనున్న వాటర్ స్పోర్ట్స్, బుద్ధిస్ట్ ఎక్స్ పీరియన్స్ సెంటర్ పనులకు , నంద్యాల జిల్లా అహోబిలం దేవాలయంలో రూ.25 కోట్లతో ఆధునికీకరణ, సుందరీకరణ పనులు,ఇతర వసతి సౌకర్యాలు వర్చువల్ గా శంకుస్థాపన చేస్తారన్నారు. అంతేగాక ఇటీవల కేబినెట్ లో 4 హోటల్స్ ఆమోదం పొందగా అందులో తిరుపతిలోని పావని హోటల్స్ బ్రాండ్ భాగస్వామి లెమన్ ట్రీ ప్రీమియర్ తో కలిసి రూ.80 కోట్ల పెట్టుబడితో 116 రూమ్స్ ఏర్పాటు చేసి 300 మందికి ప్రత్యక్షంగా, 600 మందికి పరోక్షంగా ఉపాధి కల్పించే ప్రాజెక్టుకు వర్చువల్ గా శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఇప్పటికే ఎంఓయూ చేసుకున్నామన్నారు అనంతరం నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

### గండికోటకు అంతర్జాతీయ ఖ్యాతి:మంత్రి దుర్గేష్

అద్భుతమైన వారసత్వ సంపదగా కీర్తిగాంచిన గండికోట పర్యాటక ప్రాజెక్టుకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. శంకుస్థాపన అనంతరం పనులు ప్రారంభమవుతాయన్నారు. వ్యూపాయింట్స్, చారిత్రక, వారసత్వ కట్టడాల అభివృద్ధికి రూ.28 కోట్లు, బోటింగ్ సదుపాయాలకు రూ.1.24 కోట్లు, పర్యాటకుల సందర్శన, ఇతర అభివృద్ధికి రూ.12.73 కోట్లు, పర్యాటకుల సదుపాయాలు, సేవా కేంద్రాలకు రూ.15.11 కోట్లు, టెంట్ సిటీ అభివృద్ధికి రూ.5.05 కోట్లు, వనరుల పరిరక్షణకు రూ.2.62 కోట్లు,గార్జ్ వైభవానికి రూ.89 లక్షలు మొత్తంగా జీఎస్టీతో కలిపి రూ.77.91 కోట్లు ఖర్చు చేయనున్నామని మంత్రి దుర్గేష్ వివరించారు. గండికోటకు వచ్చే పర్యాటకులు ఒకరోజుకే పరిమితం కాకుండా మరిన్ని రోజులు ఇక్కడ గడిపేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలు చేశారన్నారు. ఈ క్రమంలోనే సీఎం చంద్రబాబునాయుడు ముందు చూపుతో ఏపీ పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పనతో పాటు నూతన పర్యాటక పాలసీ 2024,29 ప్రకటించిన విషయం గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది ఇన్వెస్టర్లు ఆకర్షితులై పీపీపీ విధానంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. సర్వాంగ సుందరంగా గండికోట:మంత్రి దుర్గేష్ గండికోటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.గండికోటను రెండు రకాలుగా విభజించి అభివృద్ధి చేయనున్నామన్నారు. గండికోట పోర్ట్ అద్భుతమైన కట్టడమని, దీనిలో భాగంగా వివిధ కట్టడాలతో పాటు పురాతన రంగనాథ స్వామి ఆలయం, జుమ్మా మసీదును అనుసంధానించి పాత్ వే ఏర్పాటు ద్వారా సందర్శకులు సులువుగా సందర్శించుకునేలా చేస్తామన్నారు. గార్జ్ ప్రాంతంలో సహజ సిద్ధంగా ప్రవహిస్తున్న నదీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఎమినిటీస్ లో భాగంగా మినీ థియేటర్, చిల్డ్రన్ ఏరియా, టాయిలెట్లు, ప్రకృతి సౌందర్యాలు వీక్షించేలా వ్యూపాయింట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కుంభమేళా తరహాలో ఖాళీ ప్రదేశంలో పర్యాటకులకు వసతి కల్పించేలా 30 పాలిష్డ్ టెంట్ లు ఏర్పాటు చేయనున్నామన్నారు.

### యునెస్కో గుర్తింపు వచ్చేలా చర్యలు

అహోబిలం, గండికోట ప్రాంతాలకు యునెస్కో గుర్తింపు వచ్చేలా తీర్చిదిద్దాలని డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో అక్కడి సహజ శిల్ప కళా నైపుణ్యాలు, చారిత్రక కట్టడాల వైభవం చెక్కు చెదరకుండా సుందరీకరణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఆ దిశగా తాము కృషి చేస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు.గండికోటలో 5 స్టార్ హోటల్స్ ఏర్పాటు..ఏపీలో 15 20 హోటల్స్ ఏర్పాటుకు కృషి:మంత్రి దుర్గేష్గండికోట పర్యాటక ప్రాంతానికి సమీపంలో ఒబెరాయ్ గ్రూప్ 5 స్టార్ హోటల్ పెట్టేందుకు ముందుకు వచ్చిందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఒబెరాయ్ హోటల్ కు శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఏపీలో పీపీపీ విధానంలో దాదాపు 1520 హోటల్స్ ను తీసుకొస్తున్నామన్నారు.

### ఏపీలో పర్యాటక వృద్ధి

ఏపీలో పర్యాటక రంగం వేగంగా వృద్ధి చెందుతుందన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందేందుకు సీఎం తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు, ఇన్వెస్టర్లు, అధికారులు అందరి చురుకైన పాత్ర కారణమన్నారు.విజయవాడలో రెండు సార్లు, విశాఖపట్టణం, ముంబయిలలో ఇన్వెస్టర్ సమ్మిట్ లు నిర్వహించామన్నారు. ఇటీవల సీఎం సమక్షంలో దాదాపు రూ.10వేల కోట్లవిలువైన ఎంవోయూలు చేసుకున్నామన్నారు. ల్యాండ్ పార్సిల్ ను బహిరంగంగా అడ్వర్ టైస్ చేసిన నేపథ్యంలో ఇన్వెస్ట్ మెంట్ లకు డిమాండ్ పెరిగిందని, ఈ సందర్భంగా ఒకే ప్రదేశంలో ఇద్దరు ముగ్గురు పెట్టుబడులు పెట్టాలని ముందుకు వచ్చారని తెలిపారు. ఈ క్రమంలో ఆయా కంపెనీల స్థితిగతులు, బెటర్ ట్రాక్ రికార్డు, తట్టుకొని నిలబడి పూర్తి చేయగల సామర్థం, ఎంప్లాయిమెంట్ పాలసీ ద్వారా ఎక్కువ మందికి ఎవరు ఉపాధి ఎవరు కల్పిస్తారు తదితర అంశాలు పరిగణలోకి తీసుకొని అత్యుత్తమ కంపెనీలను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామన్నారు. గడిచిన నెలలో కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరీ చేతుల మీదుగా రూ.94.44 కోట్లతో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన విషయం గుర్తుచేశారు. స్వదేశీ దర్శన్ స్కీమ్ క్రింద సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.53 కోట్లు కేంద్రం మంజూరు చేసిన విషయం గుర్తుచేశారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టిన కార్యక్రమాలు ఒకవైపు, మరో వైపు సీఎం చంద్రబాబునాయుడు ముందు చూపుతో తీసుకున్న నిర్ణయాలతో పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారన్నారు.

### అభివృద్ధి పరుగులు పెడుతుంది : జిల్లా ఇన్ చార్జి మంత్రి

జిల్లా ఇన్ చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ మంత్రి కందుల దుర్గేష్ ను ప్రశంసించారు.గడిచిన ఐదేళ్లలో పర్యాటక రంగం అభివృద్ధి కుంటుపడితే ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం, ప్రత్యేకించి పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరుగులు పెట్టిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసిన తర్వాత కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా కడపలో అనేక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ప్రధాన మంత్రి ఆశీర్వాదంతో, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల దిశా నిర్దేశంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందన్నారు. జమ్మలమడుగు సమీపంలో గూడెంచెరువు గ్రామంలో పెన్షన్ అందించేందుకు స్వయాన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పెన్షన్ ఇచ్చిన అనంతరం సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, బడుగు బలహీన వర్గాల సమస్యలు తెలుసుకోనున్నారని తెలిపారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4000 పెన్షన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. పెన్షన్ అందించే సమయంలో 1వ తేదీ ఆదివారం, సెలవుదినం వస్తే ముందు రోజే పెన్షన్లు అందిస్తున్నామన్నారు. పెన్షన్లను పెంచి వికలాంగులకు రూ.6000, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.15000 అందిస్తున్నామన్నారు.కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇచ్చామన్నారు. ఆగస్ట్ 15నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించనున్నామన్నారు. అంతకుముందు మంత్రి కందుల దుర్గేష్ కు కడప ఎయిర్ పోర్టులో జిల్లా జనసేన కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.సమావేశంలో వైఎస్సార్ కడప జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి సవిత, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, స్థానిక సర్పంచ్ నారాయణరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## సర్వం సిద్ధం

జమ్మలమడుగు, జూలై 31 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకరోజు పర్యటనలో భాగంగా ఆగస్టు 01 వై ఎస్ ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు మండలంలో పర్యటనకు సంబంధించి పగడ్బందీ ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది... ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత,ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు శాసనసభ్యులు చిదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి తదితరులు పర్యవేక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జమ్మలమడుగు మండలం గూడెం చెరువులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పథకం లో భాగంగా ఆగస్టు 01 తేదీన లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో వివిధ రకాల కేటగిరీల వారీగా వై ఎస్ ఆర్ కడప జిల్లా జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 1తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ స్కీమ్ పంపిణీ లో మొత్తం 259131 మంది లబ్ధి దారులకు రూ.112.31 కోట్లు పంపిణీ జరగనున్నది.









## ఒంటిమిట్ట జెడ్పిటిసి అభ్యర్థి ఎంపికపై సమాలోచనలు

### అధిష్టానంతే తుది నిర్ణయం: జగన్ రాజు

రాజంపేట, జూలై 31 ప్రభాతవార్త

ఒంటిమిట్ట జెడ్పిటిసి స్థానానికి జరగనున్న ఉప ఎన్నికపై తెలుగుదేశం పార్టీ దృష్టి సారించింది. అభ్యర్థి ఎంపికపై నిర్ణయం తీసుకునేందుకు జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి గురువారం ఒంటిమిట్టకు వచ్చారు. మంత్రికి పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్రాజు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్ రెడ్డి, రాష్ట్ర కల్లుగీత ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలి వెంకటసుబ్బారెడ్డి, ఒంటిమిట్ట నేతలు ఘన స్వాగతం పలికారు. అలాగే బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ ,జనసేన సమన్వయకర్త ఎల్లటూరు శ్రీనివాసరాజు లు కూడా మంత్రితో సమావేశం అయ్యారు. ఓటమినేతలతో మంత్రి వేర్వేరుగా చర్చించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. జడ్పిటిసి టికెట్ ఆశిస్తున్న నాయకులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. సామాజిక వర్గ సమీకరణలపై కూడా చర్చించారు. వైసిపి వీటిని ఢీకొనెందుకు కూటమి అభ్యర్థిని ఎంపిక చేసి విషయములో పార్టీ అధిష్టానం అడిగి కట్టుబడాల్సి ఉంటుందని మంత్రి నేతలకు స్పష్టం చేసినట్లు సమాచారం. మంత్రితో కలిసిన తర్వాత జగన్మోహన్ రాజు మీడియాతో మాట్లాడుతూ అధిష్టానందే తుది నిర్ణయమని వివరించారు.



ఒంటిమిట్టలో మంత్రి జనార్దన్ రెడ్డికి గజమాలతో జగన్మోహన్ రాజు స్వాగతం

## జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పోటీకి సిద్ధం

### అధిష్టాన నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

### ఇంచార్జ్ మంత్రి సవిత, టిడిపి నాయకులు రవి,వాసు

పులివెందుల జూలై 31 ప్రభాత వార్త:



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

జడ్పిటిసి ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని అధిష్టాన నిర్ణయానికి కట్టుబడి ఉంటామని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత, జిల్లా టిడిపి ఇన్చార్జ్ శ్రీనివాస్ రెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జ్ మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డిలు అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో ఇంచార్జ్ మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విదేశీ పట్టణంలో ఉన్నందువలన ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని వారు నిర్ణయం ప్రకారం నడుచుకుంటామ న్నారు. బీటెక్ రవి మాట్లాడుతూ గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు కసనూరు గ్రామంలో సర్పంచ్గా పోటీ చేసి గెలిచామన్నారు. ఇప్పుడు కూడా అధిష్టానం నిర్ణయం ప్రకారం పులివెందుల జడ్పిటిసి స్థానానికి తన భార్య లతా రెడ్డి గాని లేదా తన తమ్ముడు జై భరత్ రెడ్డిని పోటీకి నిలబెట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పులివెందుల మండల నాయకులతో మాట్లాడి ఎవరిని అభ్యర్థిగా నిర్ణయించాలో చర్చించు కుంటామన్నారు. పోటీకి నిలవాల వద్దా అనేది అధిష్టానం పై ఆధారపడి ఉంటుందన్నారు.




### కిచెన్ గార్డెన్లపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న

# మండల విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**పీలేరు జూలై 31 ప్రభాతవార్త:**

కిచెన్ గార్డెన్ల నిర్వహణలో విధులు సక్రమంగా నిర్వహించని మండల విద్యాశాఖ అధికారులపై విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఎన్.ఎస్.యూ.ఐ, ఏ.పీ.ఎస్.జె.ఏ.సి నాయకుల డిమాండ్ చేశారు. గురువారం అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోని ఏడి గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ, ఏ.పీ.ఎస్.జె.ఏ.సి రాయలసీమ జిల్లాల కన్వీనర్ వి.ఉత్తన్న మాట్లాడుతూ గత ఏడాది కిచెన్ గార్డెన్ల కొరకు ప్రభుత్వం జిల్లాలో ఉన్నటువంటి కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి 5000 రూపాయలను మంజూరు చేసింది మంజూరు చేసినటువంటి నిధులను జిల్లా విద్యాశాఖ అధికారి గారు మండల విద్యాశాఖ అధికారులకు మార్చి ఏప్రిల్ నెలలో అకౌంట్లో వేయగా ఈ నిధులను సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు వినియోగించకుండా విధులలో నిర్లక్ష్యం వహించారు అని తెలిపారు. దీనికి కారణమేన జిల్లాలో ఉన్నటువంటి మదనపల్లె డివిజన్ మరియు నిమ్మనపల్లి, మదనపల్లి, పీలేరు, వాయల్పాడు మరియు ఇతర మండలాలలో కేవలం కొన్ని పాఠశాలలు మాత్రమే నామమాత్రంగా సొంత నిధులతో గార్డెన్ ను ఏర్పాటు చేసుకున్నారు అని అన్నారు. ముఖ్యంగా నిమ్మనపల్లి మండలంలో పరిశీలిస్తే జులై 15వ తేదీన 10 పాఠశాలలకు ఫోన్పే ద్వారా హెడ్మాస్టర్ల అకౌంట్లో వేయడం జరిగింది కానీ ఇప్పటికీ ఇంకా వేయని పాఠశాలలు కూడా ఉన్నాయి అని ఎద్దేవా చేశారు. నిధులు వేసినటువంటి పాఠశాలల్లో, వాటిని ఏమాత్రం ఉపయోగించకుండానే ఉపయోగించినట్లుగా జిల్లా విద్యాశాఖ అధికారి గారికి యుటిలైజేషన్ సర్టిఫికెట్లను ఇవ్వడం జరిగింది అని అన్నారు. ఈ విషయంలో మాకు అనేక అనుమానాలు కలిగి ఉన్నాయి అని అన్నారు. ఎందుకనగా వచ్చినటువంటి నిధులను వినియోగించకుండానే వినియోగించినట్లుగా రికార్డులను తయారు చేశారంటే ఇంకా మండలానికి వచ్చేటటువంటి నిధులలో ఎంత గోల్మాల్ జరుగుతుందో అనేటువంటి అనుమానం ఉందన్నారు. జిల్లాలో కిచెన్ గార్డెన్ కొరకు ఇప్పటివరకు కేవలం 10 శాతం 20 శాతం మాత్రమే నామమాత్రంగా పనులు ఇప్పుడు ప్రారంభించారు ఈ నిధులను హెడ్మాస్టర్లకు పంపించడంలో మండల విద్యాశాఖ అధికారులు వారి విధులలో భాగంగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. ఈ నిధులను సకాలంలో వినియోగం చేయకుండా కాలయాపన చేసినటువంటి మండల విద్యా శాఖ అధికారుల పై సమగ్ర విచారణ జరిపి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలి అని విద్యార్థి సంఘాల గా డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ కుమార్, ఏ.పీ.ఎస్.జె.ఏ.సి జిల్లా అధ్యక్షులు రాజా, ఎన్.ఎస్.యూ.ఐ మరియు ఏ.పీ.ఎస్.జె.ఏ.సి నాయకులు గోవర్ధన్ నాయుడు, సిద్ధారెడ్డి, నాగేంద్ర నాయుడు, వెంకటరమనాయుడు, మహమ్మద్ హామీద్, రమణారెడ్డి, సంతోష్ నాయుడు, సాయి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్న దృశ్యం

## మంత్రికి స్వాగతం పలికిన అతికారి క్రిష్ణ



**సిద్ధవటం జూలై 31 ప్రభాతవార్త:**

పర్యాటక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ను కడప విమానాశ్రయంలో రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్తఅతికారిక్రిష్ణ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు మంత్రికి పట్టుశాలువా గజమాలతో సత్కరించినారు అనంతరం మంత్రి వెంట భారీకాన్వాయ్ తో గండికో టబయలుదేరినారు గండికోట నందు పలు అభివృద్ధి కార్యక్రమాల పరిశీలనలో భాగంగా మంత్రి దుర్గేష్ పాటు రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి క్రిష్ణ పాల్గొన్నారు గండికోట చరిత్రను మంత్రికి తెలియజేసినారు ఈ కార్యక్రమంలో ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య చిన్న వెంకటయ్య తాతం శెట్టి నాగేం ద్రఎన్నారై చంద్ర విజయ్ మహబూబ్ బాషా పసుపులేటి గంగయ్య అవ్వరు రవి జనసేన నాయకులు వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## అట్లూరులో సుపరిపాలనలో తొలి అడుగు



**బద్వేలు, జూలై 31, ప్రభాత వార్త**

బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలం వరికుంట పంచాయతీ లో బద్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ రితేష్ రెడ్డి మరియు మాజీ విజయమ్మ ఆదేశాలు మేరకు ఈరోజు గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే పలు సమస్యలను ప్రజల నుంచి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు అట్లూరు మండల పార్టీ అధ్యక్షుడు పాపుదిప్పు మల్లికార్జున రె డ్డి, వరికుంట పార్టీ అధ్యక్షురాలు శాంతా కుమారి, వెంకటసుబ్బయ్య, మన్యం మహేశ్వర్ రెడ్డి, అట్లూరు మండలం మాజీ పార్టీ అధ్యక్షులు అల్లం వెంకటసుబ్బయ్య, యూనిట్ ప్రెసిడెంట్, మరియు కార్యకర్తలు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికకు నామినేషన్

**ఒంటిమిట్ట జూలై. 31( ప్రభాతవార్త)**



ఆగస్టు 12వ తేదీన నిర్వహించబోయే ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నిక పోటీకి వైసిపి పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు ఇరగం రెడ్డి. సుబ్బారెడ్డి జిల్లా జడ్పీ కార్యాలయంలో గురువారం నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు ఒంటిమిట్టకు చేరుకొని పోటీ చేస్తున్న తమ నాయకునితో హర్షద్వారాలు చేస్తూ బాణా సంచాలతో కడపకు చేరుకొని కార్యాలయంలో తమ నాయకుని చేత ఒంటిమిట్ట జెడ్పి టి సి స్థానానికి నామినేషన్ వేయించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మేకపాటి .నందకిషోర్ రెడ్డి, శివారెడ్డి, కూండ్ల. ఓబుల్ రెడ్డి, లక్ష్మీ నారాయణ రెడ్డి మండలానికి చెందిన వైసీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఒంటిమిట్ట జడ్పిటిసి స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా ఏలేశ్వరం .మధు మూర్తి జిల్లా జడ్పీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.

## సిపిఐ సింహాద్రిపురం మండల కార్యదర్శిగా అమీర్ భాష

**పులివెందుల,జూలై 31 , ప్రభాత వార్త:**



భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సింహాద్రిపురం మండల శాఖ ఏర్పాటు సమావేశం అంకాలమ్మ గూడూరు లోని స్థానిక కళ్యాణ మండపంలో జరిగింది ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఆయన మాట్లాడుతూ సిపిఐ సీనియర్ నాయకులు దివంగత కామ్రేడ్ కెవి నాగిరెడ్డి,పొన్నతోట వెంకటరెడ్డి లాంటి వారు ఈ ప్రాంత నాయకులేనని ఎంతో చరిత్ర కలిగిన ఈ ప్రాంతం నుంచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీలో పని చేయడానికి ముందుకు రావడం అభినందనియమన్నారు అనంతరం కోవరంగుట్టపల్లి గ్రామానికి చెందిన అమీర్ భాషను మండల కార్యదర్శిగా సభ్యులుగా అనిల్, అంకన్న, రామ్మోహన్, సురేష్, వినయ్, ఈశ్వరయ్య, మారుతి కుమార్, ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు ఈ సమావేశంలో సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు, సహాయ కార్యదర్శి బ్రహ్మం, జిల్లా సమితి సభ్యులు ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దుర్గేష్‌ను కలిసిన జనసేన నాయకులు



**వేంపల్లె జూలై 31 :(ప్రభాత వార్త)**

పులివెందుల నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతం చేసేందుకు పర్యాటక శాఖ మంత్రి తో కలిసి చర్చించినట్లు వేంపల్లె కు చెందిన పులివెందుల జనసేన నాయకులు డాక్టర్ దాసరి రవిశంకర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం జమ్మలమడుగు పర్యటన సందర్భంగ, గురువారం కడప కు వచ్చిన పర్యటన శాఖ మంత్రి కందుల దుర్గేష్ ను జనసేన నాయకులు దాసరి రవిశంకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువ కప్పి సన్మానించారు. అనంతరం దాసరి రవిశంకర్ పులివెందుల నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతం కోసం ఆయనతో చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాటంశెట్టి నాగేంద్ర, అతికారి కృష్ణ, జీవి రమణ , మార్కెట్ యార్డు డైరెక్టర్ లక్ష్మీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

## పిసిఓఎస్ తగ్గాలంటే..




పొట్ట కండరాలు బలపడటానికీ, వెన్నెముక, పిసిఓఎస్ సమస్యలు తగ్గటానికీ, సిస్టులు, ఫైబ్రాయిడ్స్ కరగడానికీ ఉష్ట్రాసనం బాగా పనిచేస్తుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా రెండు కాళ్లను వెనకకు మడిచి కూర్చోవాలి. తరవాత నెమ్మదిగా మోకాళ్ల మీద లేచి కుడిచేత్తో కుడికాలి మడమని, ఎడమేత్తో ఎడమ కాలిమడమని వెనక్కి వాలుతూ ఫొటోలో చూపిన విధంగా పట్టుకోవచ్చు. మొదటిసారి ప్రయత్నించేవారు పాదాన్ని అందుకోలేకపోతే పాదాన్ని వేళ్లమీద ఆనించి మడమని పట్టుకోవాలి. ఈ ఆసనాన్ని పదిసెకన్లు చొప్పున రోజుకి మూడుసార్లు చేయాలి. నెమ్మదిగా శ్వాస తీసుకుంటే యథాస్థితికి వచ్చి మోకాళ్లపై కూర్చోవాలి. ఈ ఆసనం చేశాక దీని అనుబంధ ఆసనం కూడా చేస్తే మరింత ఫలితం చేకూరుతుంది.

**శశాంకాసనం ...** ఉష్ట్రాసనం వేసిన తరవాత ఈ శశాంకాసనం చేస్తే శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. అందుకే దీన్ని శాంతినిచ్చే ఆసనం అని కూడా అంటారు. ఈ ఆసనం వేయడం వల్ల ఛాతీ, పొట్ట, వెన్నెమక కండరాలకి నూతన శక్తి లభించి హాయిగా ఉంటుంది. మంచి నిద్రపడుతుంది. కోపం అదుపులో ఉంటుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా వజ్రాసనంలో కూర్చోవాలి. నెమ్మదిగా రెండు చేతులనూ పైకి పెట్టి శ్వాస వదులుతూ మెల్లగా వంగి, చేతులను ముందుకు ఫొటోలో




చూపిన విధంగా ఉంచాలి. ఈ క్రమంలో నుదుటిభాగం నేలను తాకేలా ఆనించాలి. మొదటిసారి ప్రయత్నించేవారు దిండుసాయంతో చేస్తే ఎటువంటి ఇబ్బంద ఉండదు.

## నువ్వుల లడ్డు విరగకుండా !

**ఈ లడ్డూలు చలిలో** ఆరోగ్యాన్నీ, రుచినీ ఇస్తాయి. వీటిల్లో క్యాల్షియం, ఐరన్, పొటాషి యం, పీచు ఉంటాయి. కాబట్టి పిల్లల ఆరోగ్యానికి చాలా మంచిది. వీటి కోసం పావు కప్పు పల్లీలు, మూడోవంతు కప్పు తెల్ల నువ్వులు, పావు కప్పు కొబ్బరిపొడి, అర కప్పు బెల్లం తురుము, పావుచెంచా యాలకులపొడి, రెండు చెంచాల నెయ్యి తీసుకోవాలి. మందపాటి అడుగున్న కడాయిలో మొదట నువ్వులు , తర్వాత పల్లీలు దోరగా వేయించుకోవాలి. వాటిని చల్లారనిచ్చి.. ఈ లోపు కొబ్బరి పొడిని బంగారు రంగు వచ్చేంతవరకూ వేయించు కోవాలి. పల్లీల పొట్టు తీసి బరకగా మిక్సీ పట్టుకోవాలి. ఒక పాత్రలో యాలకుల పొడి, పల్లీల పొడి, నువ్వులు వేసి కలపాలి. స్టౌపై కడాయి పెట్టి దానిలో బెల్లం తురుము వేసి నాలుగు చెంచాల నీళ్లు పోసుకోవాలి. బెల్లం పూర్తిగా కరిగే సమయానికి నువ్వులు, ల్లీలు, కొబ్బరి, యాలకులపొడి వేసుకొని బాగా కలపాలి. చేతికి నెయ్యి రాసుకుని పొయ్యిమీద పెట్టండి. పాకం ముదిరి చక్కని లడ్డూలు వేయించిన జీడిపప్పు పలుకులు కలిపినా కూడా కరకలాడుతూ రుచిగా ఉంటాయి.



## 'డబుల్ చిన్'కు చెక్ పెట్టేద్దాం !



అందం విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. కొన్ని చిన్న చిన్న సమస్యలు ముఖాకృతిని దెబ్బతీస్తుంటాయి. డబుల్ చిన్ కూడా అలాంటిదే! గడ్డం దగ్గర కొవ్వులు పేరుకుపోవడం వల్ల అదనపు లేయర్‌లా కనిపిస్తుంటుంది. ఈ సమస్యతో నలుగురిలోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతుంటారు కొందరమ్మాయిలు. అయితే కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తూ డబుల్ చిన్‌ను సులభంగా తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.

ఎందుకిలా?... డబుల్‌చిన్ రావడానికి ముఖ్యంగా 3 కారణాలున్నాయని చెబుతున్నారు నిపుణులు.

- అధిక బరువు-ఆకస్మాత్తుగా బరువు పెరగడం లేదా తగ్గడం వల్ల ఈ సమస్య వస్తుంది. బరువు పెరిగినప్పుడు గడ్డం దగ్గర కొవ్వులు పేరుకుపోవడం, తగ్గినప్పుడు అక్కడి చర్మం వదులుగా మారడమే ఇందుకు కారణం.
- వంశపారంపర్యంగా డబుల్ చిన్ రావడానికి జన్యుపరమైన కారణాలూ ఉన్నాయంటున్నారు నిపుణులు.
- వయసు పైబడడం-వయసు పెరుగుతున్న కొద్దీ ముఖ కండరాలు దృఢత్వాన్ని కోల్పోవడం, తద్వారా గడ్డం కింద కొవ్వు పేరుకుపోవడం, అక్కడి చర్మం వదులువడం వల్ల కూడా డబుల్ చిన్ వస్తుందట!

**ఇంటి చిట్కాలతో ఉపశమనం!..** బాగా నమలండి..!: డబుల్ చిన్ సమస్యతో బాధపడే వారు ఆహారాన్ని బాగా నమిలి మింగాలి. ఇలా చేయడం వల్ల ముఖ కండరాలకు వ్యాయామం అంది పటిష్టంగా తయారవుతాయి. దీనివల్ల అదనపు కొవ్వులు పేరుకుపోకుండా చక్కటి ముఖాకృతిని సొంతం చేసుకోవచ్చు. అలాగే మార్కెట్లో లభించే షుగర్ ఫ్రీ చూయింగ్ గమ్స్ నమలడం కూడా మంచిదే తద్వారా దవడల దగ్గర పేరుకున్న కొవ్వు సులభంగా కరుగుతుంది.

**తెల్లసొనతో..** రెండు గుడ్లలోని తెల్లసొన, ఒక టేబుల్‌స్పూన్ పాలు, కొద్దిగా తేనె-నిమ్మరసం.. ఇవన్నీ బాగా కలిపి ఈ మిశ్రాన్ని డబుల్ చిన్ ఉన్న చోట ప్యాక్‌లా అప్లై చేసుకోవాలి. అలా 30 నిమిషాలు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. తెల్లసొన చర్మాన్ని బిగుతుగా మారుస్తుంది. ఇలా తరచూ చేయడం వల్ల డబుల్ చిన్ క్రమంగా తగ్గుముఖం పడుతుంది. గుడ్డు వాసన నచ్చని వారు ఈ మిశ్రమంలో కొన్ని చుక్కల ఏదైనా ఎసెన్షియల్ ఆయిల్ కూడా కలుపుకోవచ్చు.

**గ్రీన్ టీ.....** గ్రీన్ టీ శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేస్తుంది. చెడు కొవ్వును కరిగిస్తుంది. కాబట్టి కాఫీ, టీలకు బదులుగా గ్రీన్ టీని డైట్‌లో చేర్చుకుంటే డబుల్ చిన్‌ను క్రమంగా తగ్గించుకోవచ్చు.

**విటమిన్ 'ఇ'....** మనం రోజూ తీసుకునే ఆహారంలో విటమిన్ 'ఇ' ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. బ్రౌన్ రైస్, ఆకుకూరలు, పాల ఉత్పత్తులు, స్వీట్ కార్న్, యాపిల్, సోయా బీన్స్, పప్పు దినుసులు.. ఇలాంటి వాటిల్లో విటమిన్ 'ఇ' ఎక్కువగా లభిస్తుంది. కాబట్టి వీటిని తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలి.

**నీళ్లు ఎక్కువగా ...** రోజుకు కనీసం 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తాగడం వల్ల శరీరంలో ఉండే కొవ్వుతో



పాటు దావడ, గడ్డం కింద పేరుకున్న అనవసర కొవ్వులు కూడా కరిగిపోతాయి. అలాగే నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్ల కూడా ఆహారంలో చేర్చుకోవాలి.

**ఈ వ్యాయామాలతో...** 1. ఎక్కువగా నవ్వడం, మాట్లాడటం వల్ల కూడా ముఖ కండరాలకు చక్కని వ్యాయామం అందుతుంది. తద్వారా డబుల్ చిన్‌నూ తగ్గించరకోవచ్చు.

2. మెడ గుండ్రంగా, నెమ్మదిగా కొద్ది సమయం పాటు తిప్పడం, పైకి-కిందకు కదిలించడం.. వంటి చిన్న చిన్న వ్యాయామాలు చేసినా ఫలితం ఉంటుంది. 3. అలాగే క్యాలరీలు, కొవ్వులు లేని ఆహార పదార్థాల్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.

## వృద్ధాప్యం రానివ్వని ఉల్లికాడలు

**వంటకు రుచిని అందించే ఉల్లికాడలు ఆరోగ్యాన్నీ పరిరక్షిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు సహా పలు పోషకాలు మెండుగా ఉండే వీటివల్ల కలిగే మరిన్ని ప్రయోజనాలను తెలుసుకుందాం.**



- రోజూ వంటల్లో ఈ కాడలను ఉపయోగించడం మంచిది. వీటిలోని విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు మన శరీరంలో వ్యాధినిరోదక శక్తిని పెంచి, సీజన్లలో వచ్చే అనారోగ్యాలను దరికి చేరనివ్వవు. అలాగే వీటిలోని యాంటీ ఈ బాక్టీరియల్,యాంటీ వైరల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లకు గురికాకుండా పరిరక్షిస్తాయి. దగ్గు, జ్వరం ఉన్నప్పుడు ఈ కాడలతో చేసే సూప్ ఉపశమనాన్ని అందిస్తుంది.
- మెనోపాజ్ తర్వాత కాల్షియం లోపించడంతో ఎముకలు బలహీనపడతాయి. ఈ సమస్యను అధిగమించాలంటే తరచూ ఉల్లికాడలను ఆహారంలో చేర్చుకోవడం మంచిది. వీటిలోని కాల్షియం, కె విటమిన్ ఎముకలను బలంగా ఉంచుతాయి. అలాగే వీటిలోని సి విటమిన్ రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను తగ్గించి హృద్రోగాలను దరి చేరనివ్వదు.
- ఉల్లికాడల్లోని పీచు జీర్ణశక్తిని మెరుగ్గా ఉంచుతుంది. దీనివల్ల మలబద్ధక సమస్య ఉండదు. అధికబరువుకు దూరంగా ఉండొచ్చు. అలాగే వీటిలోని ఎ,సి,కె విటమిన్లు, కెరోటినాయిడ్స్ కంటి ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుతాయి.
- వీటిలోని బయోఫ్లావనాయిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్స్ ప్యాంక్రియాటిక్, పేగు కాన్సర్ వంటివి దరి చేరకుండా చేస్తాయి. అధిక ఈస్ట్రోజన్‌ను తొలగించే సామర్థ్యం ఉల్లికాడల్లో ఉంటుంది. ఇవి రొమ్ము కాన్సర్‌ను నిరోధిస్తాయి.
- ఈ కాడల్లోని యాంటీ ఆక్సిడెంట్స్, పొటాషియం చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. వీటిలోని అమినోయాసిడ్స్ చర్మకణాల ఉత్పత్తికి దోహదపడతాయి. సాగే గుణాన్ని తేమని అందిస్తాయి. చర్మాన్ని పొడిబారకుండా ఉంచడంతో వృద్ధాప్య లక్షణాలు త్వరగా దరిచేరవు.
- వీటిలోని మెగ్నీషియం కండరాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఉల్లికాడల సూప్ తీసుకుంటే కండరాల నొప్పుల నుంచి ఉపశమనాన్ని పొందొచ్చు. అలాగే ఉల్లికాడల్లో పుష్కలంగా ఉండే సల్ఫర్ సమ్మేళనాలు మన శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతాయి. దీనివల్ల మధుమేహ సమస్యకు దూరంగా ఉండొచ్చు.

## నాన్న మార్గదర్శకుడిగా..

**తండ్రులు పిల్లల పెంపకంలో చురుగ్గా పాలుపంచుకోవడం వల్ల వివిధ అంశాలలో తెలివితేటలతో వ్యవహరించడం, భావోద్వేగాల నియంత్రణ, విలువలు ఒంట పట్టించుకోవడం.. మొదలైన విషయాల్లో చిన్నతనం నుంచే పిల్లలు మరింత నేర్పరులుగా తయారయ్యే అవకాశం ఉంటుంది నిపుణులు**

చెబుతున్నారు. నాన్ననే మార్గదర్శకుడిగా చూస్తారు. వెంటతీసుకెళితే.. చాలామంది చిన్నతనంలో తండ్రి ఎక్కడికి వెళ్తే అక్కడికి తామూ వస్తామంటూ మారాం చేస్తుంటారు. అయితే అలాంటి సందర్భాలలో కొన్ని చోట్లకైనా పిల్లల్ని తీసుకెళ్లడం వల్ల సమాజంలో తమ తండ్రి ఎలా ప్రవర్తిస్తున్నారన్న విషయాన్ని పిల్లలు గ్రహించగలుగుతారు. దాన్నిబట్టి నలుగురిలో ఎలా మాట్లాడాలో, ఎలా ప్రవర్తించాలో వారికి కూడా ఒక అవగాహన వస్తుంది. కాబట్టి పిల్లల్ని సాధ్యమైనంత వరకు తమ వెంట తీసుకెళ్లడం మంచిది. అలాగే వీలైనప్పుడల్లా పిల్లల్ని తండ్రి సంరక్షణలో వదిలేయడం మంచిదే. ఫలితంగా వారి నుంచి కొత్త కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం దొరుకుతుంది.

**పెరిగే అవగాహన..** సాధారణంగా తండ్రితో కూతురికి అనుబంధం కాస్త ఎక్కువగానే ఉంటుంది. అయితే అమ్మాయిలు తండ్రులతో ఎక్కువ క్లోజ్‌గా ఉండడం వల్ల వారు ఎదుర్కొనే భావోద్వేగాలు, ఒత్తిళ్లు.. వంటివి దగ్గర్నుంచి గమనించే అవకాశం ఉంటుంది. దీంతో వారికి ఇలాంటి విషయాలపై అవగాహన పెరుగుతుంది. తద్వారా జీవితంలో ఎప్పుడైనా ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు సులభంగా వాటిని అధిగమించగలుగుతారని దాంతో మానసిక ఆరోగ్యంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడదని నిపుణులు చెబుతున్నారు.

**మార్గదర్శకుడిగా....**

తల్లి మాదిగానే తండ్రి పెంపకం వల్ల కూడా పిల్లలకు కష్టసుఖాలు, బరువు-బాధ్యతలు, ప్రేమానుబంధాలు.. మొదలైనవన్నీ చిన్నతనం నుంచి అలవడతాయి. ఎదుగుతున్న కొద్దీ వీటన్నింటిపై పిల్లలకు పూర్తి అవగాహన ఏర్పడే అవకాశం ఉంటుంది. చిన్నప్పట్నుంచీ ఇలాంటి ఎన్నో విషయాలను తండ్రులను చూసి నేర్చుకోవడం వల్ల క్రమంగా తండ్రులే వారికి మార్గదర్శకులుగా మారే అవకాశం ఉంటుంది.

## జుట్టు సమస్యలకు కాకర !



**కాకరతో చేసిన వంటకాలు తినాలంటే అబ్బా.. చేదు అనుకోకుండా ఉండలేం. అయితే కాకరకాయ వల్ల మనకు ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయన్న విషయం తెలిసిందే. కాకర వల్ల కేవలం ఆరోగ్యానికే కాదు..**

మన కురుల అందానికీ ఎంతో మేలు జరుగుతుంది. కాకర రసం తరచూ పట్టించడం వల్ల జుట్టు రాలే సమస్య తగ్గుముఖం పడుతుంది. అలాగే కుదుళ్ల దృఢంగా, కురులు ఒత్తుగా తయార వుతాయి. అలాగే దీనిలో ఉండే కుదుళ్ల దృఢంగా, కురులు ఒత్తుగా తయారవు తాయి. అలాగే దీనిలో ఉండే యాంటీమైక్రోబియల్ గుణాల వల్ల చుండ్రు, తలలో వచ్చే ఇతర ఇన్ఫెక్షన్లు దరి చేరకుండా ఉంటాయి. ఈ ప్రయోజనాలను పొందాలంటే ఏం చేయాలో తెలుసుకుందాం..

**జుట్టు రాలే సమస్యకు...** ఈ రోజుల్లోనఎంతోమంది ఎదుర్కొనే సమస్య జుట్టు రాలిపోవడం. ఈ క్రమంలో కాకర రసాన్ని ఉపయోగిస్తే ఈ సమస్య నుంచి బయటపడచ్చు. దీనికోసం అరకప్పుకాకర రసాన్ని తీసుకొని దానిలో చెంచా కొబ్బరి నూనెను కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు మొత్తానికి పట్టించాలి. మాడుకు కూడా రాసి ఐదు నుంచి పది నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. ఆ తర్వాత ముప్పై నుంచి నలభై నిమిషాల పాటు ఆరనివ్వాలి. అనంతరం గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఈ మిశ్రమాన్ని వారంలో రెండుసార్లు అప్లై చేసుకోవడం ద్వారా జుట్టు రాలే సమస్య అదుపులోకి వస్తుంది.

**చివర్లు చిట్లితే...** మన ఉపయోగించే హెయిర్‌కేర్ ఉత్పత్తుల్లోని రసాయనాలు, బయట కాలుష్యం ప్రభావం కారణంగా జుట్టు చివర్లు చిట్లడం సాధారణ సమస్యగా మారిపోయింది. దీనిపై మనం తలస్నానం చేసే విధానం కూడా ప్రభావం చూపుతుంది. దీన్ని నివారించడానికి సరిపడినంత కాకరకాయ రసాన్ని తీసుకొని కురులకు పట్టించాలి. 40 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చొప్పున చేస్తే.. మూడు వారాల్లో మంచి ఫలితం కనిపిస్తుంది.

**చుండ్రు తగ్గించడానికి ....** కురుల విషయంలో తగినంత శ్రద్ధ వహించక పోవడం, పోషకాహారం తీసుకోక పోవడం, కాలుష్యం తదితర కారణాల వల్ల చుండ్రు సమస్య ఎదురవుతుంది. దీనికోసం కొద్దిగా జీలకర్ర తీసుకొని మెత్తటి పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. దీన్ని కాకర రసంలో కలిపి దాన్ని మాడుకు అప్లై చేసుకోవాలి. కొంతసేపు ఆరనిచ్చి ఆ తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు నుంచి మూడుసార్లు చేయడం ద్వారా చుండ్రు సమస్య నుంచి విముక్తి కలుగుతుంది.

**తెల్లజుట్టు సమస్యకు...** వివిధ కారణాల వల్ల కొంతమందిలో కుదుళ్ల వద్ద మెలనిన్ ఉత్పత్తి ఆగిపోతుంది. ఫలితంగా చిన్నవయసులోనే జుట్టు తెల్లగా మారిపోతుంది. ఇలాంటి వారు తెల్ల వెంట్రుకలు కనపడకుండా చేయడానికి హెయిర్‌డైని వేసుకుంటూ ఉంటారు. వీటిలోని రసాయనాల వల్ల జుట్టు పాడయ్యే అవకాశం ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే కాకరను ఉపయోగించడం మంచిది. దీనికోసం సరిపడినంత కాకర రసాన్ని తీసుకొని దాన్ని వెంట్రుకల కుదుళ్ల నుంచి చివరి దాకా పట్టించి గంట పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా కొన్ని రోజులపాటు చేయడం వల్ల తెల్లజుట్టు తగ్గుముఖం పడుతుంది.

**పొడిబారిన జుట్టుకు..** కాకర రసం, పెరుగు అరకప్పు చొప్పున తీసుకోవాలి. వీటికి రెండు చెంచాల నిమ్మరసం జత చేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో కొంత భాగాన్ని మాడుకు పట్టించి కాసేపు మునివేళ్లతో మృదువుగా మర్దన చేయాలి. మిగిలిన భాగాన్ని వెంట్రుకలకు మొత్తం పట్టించి ముప్పై నిమిషాల పాటు అరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.



# మండలంలో తహసిల్దార్ సుడిగాలి పర్యటన


సమస్యలను పరిష్కరిస్తున్న తహసిల్దార్ శివకుమార్


అంగన్వాడి సెంటర్లో తనిఖీలు నిర్వహిస్తున్న తహసిల్దార్ శివకుమార్

**పీలేరు జూలై 31 ప్రభాతవార్త**

గత నెల రోజుల క్రితం నూతనంగా పీలేరు రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దారుగా బాధ్యతలు తీసుకున్న శివకుమార్ ఒక నెల పరిధిలోనే మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో సుడిగాలి పర్యటన చేసి ప్రజలకు ముఖ్యంగా రైతులకు విద్యార్థులకు అంగన్వాడీ సెంటర్లలో తనిఖీలు చేస్తూ ప్రజా సమస్యలపై అధికారులతో సమన్వయం చేసి వీఆర్వోలను అప్రమత్తం చేసి ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తుండటం చూస్తే పలువురు రెవెన్యూ అధికారులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో ఇప్పటికే ప్రజా సమస్యలు పేరుకుపోయి ఉన్నత అధికారులకు తో కలవటమే కాకుండా ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే పీజేఆర్ఎస్ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్న విషయం తెలుసుకున్న మండల రెవెన్యూ అధికారి శివకుమార్ ప్రతిరోజు ఉదయం ఒక గ్రామంలో రెవెన్యూ సమస్యలపై ఆ గ్రామ రెవెన్యూ అధికారిని వెంటబెట్టుకోవటమే కాకుండా ఆ గ్రామానికి సంబంధించిన రికార్డులను తీసుకొని వెళ్లి రైతులతో చర్చించి సమస్యను అక్కడికక్కడే పరిష్కరిస్తుండటంతో పలువురు ఫిర్యాదుదారులు తహసిల్దార్ అభిమానం వ్యక్తం చేయడమే కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించే అధికారి రావడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు అదేవిధంగా గ్రామాలలో నడుస్తున్న అంగన్వాడి సెంటర్లలో చిన్నపిల్లలకు అందుతున్న పౌష్టిక ఆహారాన్ని తనిఖీ చేసి అంగన్వాడీ సిబ్బందికి సూచనలు సలహాలు ఇస్తున్నట్లు కూడా తెలుస్తుంది పలువురు రైతులు భూ సమస్యలపై ఫిర్యాదులు చేయడంతో సమస్యను పరిష్కరించేందుకు అధికార బృందంతో తమ భూమిలోకి వెళ్లి విచారించి వాస్తవాలను ఉన్నత అధికారులకు నివేదిక రూపంలో అందజేస్తుండటంతో సమస్యను సాగదీయకుండా పరిష్కారం వైపు పరుగులెత్తిస్తుండటం హర్షించదగ్గ విషయమేనని మండల ప్రజలు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు .ఏది ఏమైనప్పటికీ మండలాలలో పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలను ఉన్నతాధికారుల ఆదేశాలతో పరిష్కరిస్తున్న తహసిల్దార్ శివకుమార్‌ను అభినందించక తప్పదని ఇలాగే మరిన్ని సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు వెళ్లాలని కోరుకుందామని ప్రజలు అంటున్నారు.

## అధిక ధరలకు అమ్ముతుంటే ఫిర్యాదు చేయండి

**మదనపల్లి క్రైమ్, జూలై 31 ప్రభాతవార్త.**



మద్యం దుకాణాల వద్ద అధిక ధరలకు అమ్ముతుంటే 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని అన్నమయ్య జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర సూచించారు. గురువారం మదనపల్లి ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఈఎస్ మాట్లాడుతూ ప్రతి మద్యం షాపు వద్ద క్యూఆర్ కోడ్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్యూఆర్ స్కాన్ చేయగానే నాణ్యమైన మద్యం విక్రయిస్తున్నారా లేదా, మద్యం అధిక ధరలు అమ్ముతున్నారా అనే ప్రశ్న రావడం జరుగుతుందన్నారు. మద్యం అధికధరలకు అమ్ముతుంటే అందులో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది జిల్లాలో303 సారా కేసులు నమోదు చేసి, 259 మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. 1940 లీటర్ల సారాను, 2,445 కిలోల బెల్లంను, 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా 73055 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. నవోదయం ద్వారా సారావిక్రయాలను మానేసిన 325 మందిని గుర్తించి వారికి స్వయం ఉపాధి కోసం రాయితీతో కూడిన రుణాలు ఇప్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెంట సిఐ ఉన్నారు.

## కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎంపిడిఓ

**రామసముద్రం జూలై 31 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ నందు మహిళలకు ప్రభుత్వం ఉచితం టైలరింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈటైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఎంపిడిఓ గఫూర్ పరిశీలించి శిక్షణ పొందుతున్న వారికి తగు సూచనలు ఇవ్వడం జరిగింది.అలాగే కమ్మ వారి పల్లె, ఎలకపల్లె, నారిగాని పల్లె, మినికి గ్రామ పంచాయతీ లలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించి సచివాలయం సిబ్బందికి పలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో ఎంపిడిఓ గఫూర్ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## మిట్స్‌లో ఐ త్రిబుల్ ఈ అంతర్జాతీయ సదస్సు



**కురబలకోట జూలై 31 ప్రభాత వార్త**

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు 3వ ఐ.ఈ.ఈ.ఈ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ICDSNS-2025 కల్పతరూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, టిప్టూర్‌లో జరిగిన కార్యక్రమంలో తమ విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ పవన్ కుమార్ మరియు సి. శ్రీనివాస్ సహాయ సహకారంతో విద్యార్థులు చేసిన ప్రాజెక్టు పరిశోధనకు ప్రశంసలు అందుకున్నట్లు ఆయన అన్నారు. ఈ దిశగా, విద్యార్థుల బృందం ఉష్ణోగ్రత ఆధారిత కల్మాన్ ఫిల్టరింగ్ విధానాన్ని ఉపయోగించి, గ్రిడ్ ఇంటరాక్టివ్ ఎలక్ట్రిక్ వెహికల్ బ్యాటరీల కోసం సమగ్ర SOC అంచనా విధానాన్ని అభివృద్ధి చేసింది. ఈ కొత్త పద్ధతి ద్వారా ఉష్ణోగ్రత మార్పులు బ్యాటరీ ప్రవర్తనపై చూపే ప్రభావాన్ని ఖచ్చితంగా విశ్లేషించవచ్చు, కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను కరెస్పాండెంట్ డాక్టర్ యెన్ విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల మరియు అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు

## చలో ఢిల్లీ జయప్రదం చేయండి

**మదనపల్లెక్రైమ్, జూలై 31 ప్రభాతవార్త.**

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల నాలుగో తేదీ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పొదల నరసింహులు తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా వాల్మీకులను ఎస్టీ లో చేరుస్తామంటూ రాజకీయ నాయకులు మోసం చేస్తున్నారనన్నారు. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లు తాము అధికారంలోకి రాగానే వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తామని హామీ ఇచ్చి ఇప్పటికి ఏడాది గడుస్తున్నా ఆ ఊసే ఎత్తలేదన్నారు. ఢిల్లీలో తమకు సానుకూల స్పందన రాకపోతే తిరిగి విజయవాడలో ఆందోళన కార్యక్రమాలకు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి విజయ మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు తరకొండ రఘు, నియోజకవర్గ గౌరవాధ్యక్షులు దేగల రామకృష్ణ, కట్టుబావి మధు, ప్రొద్దుటూరు కమలాకర్, పసుపులేటి సూరి, మేకల భరత్, మేకల గుర్రప్ప, టి. శంకర పాల్గొన్నారు.

## పంటను పరిశీలించిన వ్యవసాయ సంచాలకులు

**యర్రగుంట్ల జూలై 31 ప్రభాతవార్త**



మండల పరిధిలోని సుంకేసల గ్రామంలో గురువారం వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. వేరుశనగ పంటకు పచ్చ దోమ ఆశించి ఆకులు శివరా ఎరుపుగా కాలినట్లు కనిపిస్తుందని దానివల్ల పంట దిగుమతి తగ్గిపోతుందని తెలియజేశారు. వేరుశనగ పంటలో ఎకరాకు చొప్పున పసుపు మరియు నీలం రంగు జిగురుటలకు తప్పనిసరిగా ఏర్పాట్లు చేయాలని తెలియజేశారు. పచ్చదనం నివారణకు గాను ఇమీడా క్లోప్రిడ్ 0.4 ఎమ్మెల్ లీటర్ నీటికి మరియు 13:0:45 లను ఎకరాకు కేజీ చొప్పున కిచికరి చేయాలని తెలిపారు. రైతులు తప్పనిసరిగా జిప్సం ను ఎకరాకు 200 కేజీలు చొప్పున వేరుశనగ పంటలో తప్పనిసరిగా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు బస్సు సౌకర్యం ఎంతో మేలు

**సుండుపల్లె, జూలై 31, ప్రభాతవార్త:**



ఇంజనీరింగ్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి వెంకటేష్ నాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో బిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల కోసం ఆ కళాశాల చైర్మన్ భాస్కర్ సుండుపల్లె నుండి నూతనంగా బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. మారుమూల సుండుపల్లి మండలం నుండి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం వలన ఇంజనీరింగ్ వైపు ఎక్కువమంది విద్యార్థిని విద్యార్థులు ముగ్గు చూపే అవకాశం ఉందన్నారు. చాలామంది సుదూర ప్రాంతాల్లో ప్రవేట్ హాస్టల్లో ఉంచి చదివించేందుకు ముగ్గు చూపకపోవడం వలన విద్యకు దూరమవుతున్నారని అన్నారు. తక్కువ ఖర్చుతో రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రిబ్బన్ కటింగ్ చేసి బస్సు సౌకర్యాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిట్స్ కళాశాల చైర్మన్ భాస్కర్, ఉపాధ్యాయులు ఆంజనేయులు, వెంకటరమణ నాయక్, లిటిల్ స్కూల్ కరస్పాండెంట్ నాగేశ్వరరావు, బిసి నాయకులు మునిస్వామి, సీఆర్పీలు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి కాలనీలో పారిశుద్ధ్య పనులు

**రామసముద్రం జూలై 31 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి కాలనీలో ఎంపిడిఓ గఫూర్, పంచాయతీ కార్యదర్శి మునిస్వామి నాయక్ ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. మండలంలోని పలు పంచాయతీలలో కాలువలలో పేరుకు పోయిన చెత్తను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గఫూర్, పంచాయతీ సెక్రటరీ మునిస్వామి నాయక్ కార్మికులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం

**తంబళ్లపల్లె జూలై 31 ప్రభాతవార్త ః**



తంబళ్లపల్లె మండలం లో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే ఉక్కు పాదం మోపుతామని ఎస్సై ఉమా మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన తంబళ్లపల్లె మండల కేంద్రం లో విస్తృతంగా పర్యటించి పలు తనిఖీలు చేపట్టి పలు భద్రతా సూచనలు చేశారు. తంబళ్లపల్లె ఇండియన్ బ్యాంక్, ఎస్బిఐ బ్యాంక్ తోపాటు క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఏటీఎం సెంటర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. బ్యాంకుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు పనిచేసే విధానంపై మేనేజర్లను అడిగి తెలుసుకుని సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చూసి భద్రతపై పలు సూచనలు చేశారు. అదేవిధంగా మెయిన్ బజార్ లో పర్యటించి వాహన చోదకులకు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్, రికార్డులు లేకుండా ప్రయాణం చేయరాదని, త్రిబుల్ రైడింగ్ తో పాటు అతివేగం పనికిరాదని హితవుపలికారు. ఎక్కడైనా కొత్త వ్యక్తులు సంచారం తో పాటు జూదం, కోడిపందాల నిర్వహణపై ప్రజలు సహకరించి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**మదనపల్లె, జూలై 31 ప్రభాతవార్త :**

పట్టణంలో ఏ వార్డులో కూడా తాగునీటిసమస్య ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే సచివాలయ అమినిటీస్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల పట్టణంలో అక్కడక్కడా నీటి ఎద్దడి నెలకొందన్నారు. ప్రజలు నీటి ఎద్దడితో ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పట్టణంలో నీటి ఎద్దడి ఉన్న వార్డుల్లో కొత్తగా బోర్లు డ్రిల్ చేయడం జరిగిందన్నారు. పైపులైన్ ద్వారా ప్రతి వార్డుకు నీటిసరఫరా చేయాలన్నారు. రెండు రోజులకు ఒక్క పర్యాయం నీటి సరఫరా చేయడానికి మున్సిపల్ ఫిట్టర్లు చర్యలు చేపట్టాలన్నారు. నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. వార్డుల్లో ప్రజలకు అందుబాటులో ఉండి నీటిసమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో మెరుగైన నీటిసరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. అదనంగా ఫిట్టర్ల నియామకానికి చర్యలు తీసుకొంటామన్నారు. నీటి ఎద్దడితో పాటు పట్టణంలో పారిశుద్ధ్య నివారణకు కూడా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ప్రమీళ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


నీటి ఎద్దడిపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని పూజలు

### 101 టెంకాయలు కొట్టిన వైసిపి నాయకులు

**మదనపల్లె, జులై 31 ప్రభాతవార్త :**


పూజలు చేస్తున్న దృశ్యం

లిక్కర్ కేసులో అక్రమంగా అరెస్టు అయిన రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని గురువారం శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ రాజకీయ కక్షతో ఎంపి మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందన్నారు. అక్రమ కేసులు పెట్టిన కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, సాయిబాబాకు పూజలు చేసి కోరుకోవడం జరిగిందన్నారు. వైకాపా ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల మల్లికార్జున మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాపాలన పక్కనపెట్టి వైకాపా నాయకులపైన అక్రమ కేసులు పెట్టడమే పనిగా పెట్టుకొందన్నారు. అక్రమ కేసులతో వైకాపా నాయకులను బయపెట్టలేరన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఈశ్వర్‌నాయక్, శారదారెడ్డి, అనుపమ, లక్ష్మీదేవి, మహేష్, మల్లికార్జున, సాధిక్, శ్రీకాంత్, జబీబుల్లా, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు పాఠశాల సందర్శిన

**మదనపల్లె, జులై 31 ప్రభాతవార్త :**


సత్కరిసున్న దృశ్యం

పట్టణ సమీపంలోని వెలుగు ప్రత్యేక పాఠశాలను గురువారం కస్తూరిబా పాఠశాల ఉపాధ్యాయులు సందర్శించారు. రాష్ట్రంలోని పది జిల్లాలకు చెందిన కస్తూరిబా ఉపాధ్యాయులు వెలుగు సంస్థను సందర్శించి అక్కడ బుద్ధిమాంద్యులకు, వృద్ధులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకొన్నారు. గత 28ఏళ్ళుగా వెలుగుసంస్థ అందిస్తున్న సేవలు పట్ల వారు వెలుగుస్కూల్ సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మిలను అభినందించారు. ఇక్కడ బుద్ధిమాంద్యులకు, వృద్ధులకు చేస్తున్న సేవలు పట్ల వారు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. వెలుగుస్కూల్‌లో రోజువారి అందిస్తున్న సేవల గురించి ప్రిన్సిపాల్ లీనాకుమారిని అడిగి తెలుసుకొన్నారు. అంతేకాకుండా వెలుగుపాఠశాలలో విద్యాబోధన, చిన్నారుల నృత్యప్రదర్శనలు, ఆటలను చూసి అభినందనలు తెలిపారు. పిల్లల ప్రదర్శనలు, వెలుగు విద్యార్థుల స్ఫూర్తిదాయక గాథలపై ప్రసంశించారు. ఈ సందర్భంగా వారికి వెలుగుస్కూల్ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మిలు శాలువ కప్పి, మెమెంటోలు అందజేశారు.

## సుపరిపాలనను చూసి టిడిపిలో చేరుతున్నాం

### ఎమ్మెల్యే సమక్షంలో 40మంది చేరిక


ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన దృశ్యం

**మదనపల్లె, జులై 31 ప్రభాతవార్త :**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందిస్తున్న సుపరిపాలనను చూసి తాను తెలుగుదేశంపార్టీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమక్షంలో చేరుతున్నట్లు 1వ వార్డు అనపగుట్టకు చెందిన వెంకట నరసింహులు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే సమక్షంలో ఆయన పార్టీలో చేరి విలేకర్లతో మాట్లాడారు. తాను గతంలో ఒకటవ వార్డులో స్వతంత్ర్య అభ్యర్థిగా మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేశానన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారం పట్ల ఆయన చూపుతున్న చొరవతోనే తాను టిడిపిలో చేరడానికి కారణం అన్నారు. టిడిపి సీనియర్ నాయకులు కాలం రఘుపతినాయుడు ఆధ్వర్యంలో తనతో పాటు 40మంది అనుచరులతో కలసి ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిపార్టీలో చేరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, నాగ, శేఖర్‌రెడ్డి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మేడికుర్తి లో పి4 గ్రామసభ

**పీలేరు, జూలై 31 ప్రభాతవార్త:**



నియోజకవర్గంలోని కలికిరి మండలంలోని మేడికుర్తి గ్రామంలోని సచివాలయంలో పి4 గ్రామసభ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి మరియు స్పెషల్ ఆఫీసర్ కే.సుబ్రహ్మణ్యం హాజరై ఆయన మాట్లాడుతూ బంగారు బతుకులు కార్యక్రమంలో భాగంగా మేడుకుర్తి పంచాయతీలో 34 మందిని బంగారు కుటుంబం లో గుర్తించబడ్డాయి. ఈ వీరిని మనం దత్తత తీసుకోవడం ద్వారా వారి జీవిత స్థితిగతులు మెరుగుపడేలా చేయడమే మా లక్ష్యం. అనంతరం ఎంఈఓ1 కరీముల్లా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యత పెంపొందించేందుకు గ్రామస్థాయిలోనే భాగస్వామ్యం చాలా ముఖ్యం. విద్యార్థుల హాజరు పెంచడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమైంది. ఉపాధ్యాయులు, వాలంటీర్లు, గ్రామ పెద్దలు కలిసి పనిచేస్తేనే ఫలితాలు కనిపిస్తాయి," అని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి నవాజుల్లా మాట్లాడుతూ"గ్రామ అభివృద్ధిలో ప్రతి పౌరుడి పాత్ర ఉందని అందరూ గుర్తించాలి. మేడుకుర్తి పంచాయతీలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రణాళికలో ఉన్నాయి. నీటి సరఫరా, రోడ్లు, మురుగునీటి సమస్యలపై అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్రామస్తులు తమ అభిప్రాయాలను, అవసరాలను స్పష్టంగా చెప్పితే వాటి పరిష్కారానికి కృషి చేస్తాం," అని తెలిపారు. పలు అంశాలపై ప్రజలు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమగ్రమైన సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ అల్లా బక్షు, మాజీ సర్పంచ్ ప్రహ్లాద, ఎంఈఓ2 నాగార్జున, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సల్మా భాను, వెల్ఫేర్ అసిస్టెంట్ హరినాథ్ రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ బి.కృష్ణవేణి, మహిళా పోలీస్ జి.ఎం. వర ప్రియ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఉల్లి పంటకు ప్రీమియం గడువు పెంచాలి.

**తొండూరు జూలై 31 ప్రభాతవార్త:**

తొండూరు మండల చుట్టుపక్కల గ్రామాల పరిధిలో ఖరీఫ్ సీజన్లో ఉల్లి పంటను సాగు చేయడం జరిగింది. సాగు చేసిన రైతులు తమకు న్యాయం జరుగుతుందని అనుకునే లోపే సరైన టైంలో సర్వర్ పనిచేయక ఆన్లైన్ కేంద్రాల వద్ద పడి కాపులు కాస్తున్నామని వేసిన ఉల్లి పంటకు ప్రీమియంను చెల్లించేందుకు గురువారంతో ముగుస్తుందన్న రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వము ఇప్పటికైనా స్పందించి ఉల్లి పంటకు బీమా ప్రీమియం చెల్లించ్చేటదుకు ఇంకా కొద్ది రోజులసమయము కేటాయించి తమకు న్యాయం చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నాలుగు రోజులుగా ఆన్లైన్ కేంద్రాల వద్దకు వచ్చిన పై నుండి సర్వర్ పని చేయడం లేదు అని ఆన్లైన్ సిబ్బంది తెలుపుతూ ఈరోజు పని చేస్తున్నందున గడువు ముగిస్తుందని తెలుసుకొని చుట్టుపక్కల గ్రామాల రైతులు ఆన్లైన్ కేంద్రాల వద్ద బారులు తీరి ప్రీమియం చెల్లించుచున్నారు. మిగిలిన ఇంకా కొంత మంది రైతులు చేసేది ఏమీ లేక తిరిగి వెళ్లిపోయారు.



## నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ




**పోరుమామిళ్ల రూరల్, జూలై 30ప్రభాతవార్త:**

మండలంలోని చిత్తా శౌరి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకారంతో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్ రెడ్డి చిత్తా దంపతుల ఆధ్వర్యంలో వారి ప్రతినిధులు ఎల్. ప్రసాద్ రెడ్డి, జి. శ్రీకాంత్ రెడ్డిలు స్థానిక పోరుమామిళ్లలోని ఓ.ఎల్.ఎఫ్. జూనియర్ కళాశాలలో చదువుతున్న బాలికలు 150 మందికి ఉచితంగా బ్యాగులు, 450 నోటు పుస్తకాలు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని పేద పిల్లలకు కొంత సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ డెలిసి, అధ్యాపక బృందం, విద్యార్థినులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## అంతరిస్తున్న కళారంగాన్ని కాపాడండి

**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)**

రాష్ట్రాల్లో అంతరిసున్న సాంస్కృతిక కళా రంగాన్ని పునర్వైభవం వన్నె తెచ్చేలా ప్రభుత్వాలు సహకారంతో కాపాడాలని స్థానిక కళాంజలి సాంస్కృతిక సంస్థ అ ధ్యక్షుడు ఎస్ కళాంజలి కోరారు. ఇటీవల కాలంలో సా మాజిక పరంగా చోటుచేసుకునే అంశాలతో కూడిన రంగస్థల నాటకాలు, ఆధ్యాత్మిక భక్తిపూర్వ హరికథలు, వీధినాటకాలు, పండ్రరి భజనలు, జాముకుల కథలు వంటి అనేక అపూర్వ కళా సంపదలు మృగ్యమైనాయని తెలిపారు. యూట్యూబ్, సోషల్ మీడియాల్లో మాత్రమే సంగీత నాట్య ప్రదర్శనలు పరోక్షంగా ప్రదర్శన్లలు వెలువడుతున్నాయని సగటు ప్రేక్షకుడు ప్రత్యక్షంగా కనులారా వీక్షించే పరిస్థితి లేకుండా పోతోందన్నారు. జాతీయ స్థాయిలో .ప్రతి ఏటా పద్మ అవార్డులు గ్రామీణ వికాసం కోసం పనిచేసిన వారికి అందచేసేవిధంగా మార్పులు చేయాలన్నారు. సామాన్యుడు పద్మా అవార్డుకు అర్హులే అనే భావన వచ్చేలా నిబంధలు సడలించాలన్నారు. అధికారుల అవినీతి ప్రస్థానంలో అర్హతలు ఉన్నా ఎంపికలో అనేకమంది పద్మా అవార్డులు పొందలేక పోతున్నారని పేర్కొన్నారు ప్రధాన పత్రికలూ కూడా సాంస్క ృతిక కళా రంగానికి ప్రోత్సహించాలని ఈ సందర్భంగా కోరారు.

## హిందీ సాహిత్యంలో ఆదర్శప్రాయుడు ప్రేమ్‌చంద్



**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)**

హిందీ సాహిత్యంలో ప్రేమ్ చంద్ ఆదర్శప్రాయుడని మండల విద్యాశాఖ అధికారి2 సుబ్బరాయుడు పేర్కొన్నారు. ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక మండల వనరుల కేంద్రం నందు గురువారం ప్రముఖ హిందీ నవలాకారుడు, రచయిత ప్రేమ్ చంద్ 145 వ జయంతి వేడుకలు సంస్థ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి 2 సుబ్బరాయుడు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా ప్రముఖ హిందీ రచయిత ప్రేమ్ చంద్ చిత్రపటానికి పూలదండతో నివాళులు అర్పించారు. అనంతరం మండల విద్యాధికారి సుబ్బారాయుడు మాట్లాడుతూ ప్రేమ్ చంద్ తన రచనలతో యదార్థవాద సాహిత్యానికి నాంది పలికారన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 20న రాజంపేట బీ.వీ.ఎన్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి హిందీ వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్.హనీఫా మొదటి బహుమతి, మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.సబిహ సుల్తానా ద్వితీయ మరియు పుల్లంపేట ఎస్.బి.వి.డి సభ పాఠశాలకు చెందిన బి.కార్తిక తృతీయ బహుమతి అందుకున్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఆర్.నవ్య శ్రీ, పుల్లంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎం.శశి ప్రియ లు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, హిందీ ఉపాధ్యాయులు చాంద్ భాషా, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా

**బద్వేలు అర్బన్, జూలై 31, ప్రభాత వార్త**



ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఆగస్టు 2వ తేదీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలువు మేరకు కడప జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్, హెచ్ఎంఏ జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం బద్వేల్‌లోని ఎంఆర్సీ వద్ద ఫ్యాప్టో బద్వేలు ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలనిచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. సమస్య న్యాయస్థానంలో ఉండగానే ఆత్రుతగా ఉత్తర్వులను జారీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. జీవో 72, 73, 74 లను అమలు చేసి పంచాయతీరాజ్ టీచర్లకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు గంజి పెంచలయ్య, టి.శివప్రసాద్, కె.సుధాకర్, ఎం.సుబ్బరాయుడు, ఎస్.దేవానందం, సి.కంచిరెడ్డి, పి.చంద్రశేఖర్ యాదవ్, ఎస్.మస్తాన్ వలి, ఎన్.పవన్ కుమార్, ఎస్.బాలయ్య, ఆర్.రాజా, కొండయ్య, ఎ.లాజరయ్య, వెంకట సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన సిద్ధవటం టీడీపీ నేతలు

**సిద్ధవటం జూలై 31 ప్రభాతవార్త :**

మండలంలోని ప్రజల చిరకాల వాంఛ అయిన మాచుపల్లి టు ఖాదర్ బంగ్లా బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టాలని స్వర్గీయ నందమూరి తారక రామారావు చేతులు మీదుగా1988 జులై 6 శంకుస్థాపన చేపట్టినప్పటి నుండి ఇప్పటివరకు ఎటువంటి కార్యకలాపాలను నోచుకోని బ్రిడ్జిని త్వరితగతిన నిర్మాణం పనులు చేపట్టాలన్నారు, పాదయాత్రలో మన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాజంపేట సభలో స్వయాన ఇచ్చిన వాగ్దానంను నెరవేర్చాలని కోరారు ఒంటిమిట్ట మండలంలోకి వచ్చిన రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి వర్యులు, అన్నమయ్య జిల్లా ఇన్చార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసి సిద్ధవటం ప్రజల చిరకాల కోరిక మాచుపల్లి బ్రిడ్జిని నిర్మించాలని ప్రజల ఆకాంక్షను ఆకాంక్షను తీర్చ వలసిందిగా మంత్రికి వినతి పత్రం అందజేశారు అనంతరం మంత్రి శాలువా తో సత్కరించడం జరిగింది . ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ రాజంపేట పార్లమెంట్ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు సిద్దవటం మండల అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డి, మండల క్లస్టర్ ఇంచార్జి దారపునేని దశరథ రామానాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వాహన కార్యదర్శి కాడే శ్రీనివాసులు నాయుడు, భాకరాపేట సర్పంచ్ ప్రతినిధి తుర్ర ప్రతాప్ నాయుడు, మాధవరం టిడిపి యూత్ హరిప్రసాద్ పాల్గొన్నారు.



## నూతన శ్రీరామాలయానికి భూమి పూజ

### 5 లక్షల విరాళం అందించిన ముక్కా రూపానందరెడ్డి



రాజంపేట, జూలై 31 ప్రభాతవార్త

ఓబులవారిపల్లి మండలం మంగంపేట పునరావాసగ్రామం 5 లో నూతన శ్రీరామాలయానికి కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి 5 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు గురువారం జరిగిన భూమిపూజకు ముక్కా రూపానంద రెడ్డి, సతీమణి ముక్కా వరలక్ష్మి, తనయుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి పాల్గొన్నారు. ఆధ్యాత్మిక అభివృద్ధికి ముందడుగు మంగంపేట రామాలయానికి అని ఈ సందర్భంగా ముక్కా రూపానంద రెడ్డి పేర్కొన్నారు. శ్రీరాముని ఆలయం ప్రతీ గ్రామానికి ఆధ్యాత్మిక శక్తిని, సాంప్రదాయాలకు పునాదిని కలిగిస్తుందన్నారు. గ్రామ అభివృద్ధికి భౌతిక వనరులతో పాటు ఆధ్యాత్మికత కూడా అవసరమని, మన ఆలయాలు భావితరాలకు మార్గదర్శకాలని పేర్కొన్నారు. గుడి నిర్మాణానికి అవసరమైన అన్ని విధాలా సహకారం అందిస్తామని ముక్కా కుటుంబం హామీ ఇచ్చారు. శాంతి, ఐక్యతకు ప్రాతినిధ్యం వహించే ఈ ఆలయం త్వరితగతిన నిర్మాణం పూర్తి కావాలని ఆయన, గ్రామస్తులు తెలిపారు.

## బోయకొండమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

సుండుపల్లి, జూలై 31, ప్రభాతవార్త:



మండల పరిధిలోని అక్కంపల్లి నందు నూతనంగా నిర్మించిన బోయకొండమ్మ, పోతురాజు, సింహ బలిపీఠం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. అనంతరం గణపతి పూజ, యాగశాల ప్రవేశం, మృ త్య గ్రహణం, కలశ స్థాపన పూజలు, కుంకుమార్చన, అభిషేకం, వేద పారాయణం జరుగుతుందని, ఆదివార్ర ఉదయం జలాదివాస షోడ షోప చార పూజలు లక్ష్మీ దుర్గ చండీ హోమములు మంగళహారతి ఉంటుందని, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం హోమాలు ప్రాణ ప్రతిష్ట అమ్మవారు దేవాలయ ప్రవేశము జరుగును. విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు చప్పిడి మహేష్ నాయుడు, రమేష్ నాయుడు వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కావున భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని,తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

## వైభవంగా శ్రీరామపట్టాభిషేకం



పీలేరు జూలై 31 ప్రభాతవార్త :

వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామస్వామి వారి ఆలయంలో గురువారం ఉదయం 11 12 గం.ల వరకు శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరిగింది ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. తరువాత యాగశాల పూజ, ఉదయం 6.30 గంటలకు స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంలతో స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు విశేషంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ, రాత్రి 8 గంటలకు గరుడ వాహనంపై శ్రీపట్టాభిరాముడు విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో టీటీడీ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈవో శ్రీమతి వరలక్ష్మీ, అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## చేనేతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ఇంటింటా కార్యక్రమంల ఎమ్మెల్యే

మదనపల్లె, జులై 31 ప్రభాతవార్త :

చేనేతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం నీరుగట్టువారిపల్లెలోని 33వ వార్డులో ఎమ్మెల్యే సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే ధర్మవరం అనంతరం నీరుగట్టువారిపల్లెలోని చేనేతలు ఎక్కువుగా ఉంటున్నారన్నారు. వీరి సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అర్హులైన వారందరికి ఉచిత విద్యుత్, సంక్షేమ పథకాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. చేనేతల సమస్యల పరిష్కారానికి కూడా తాను కృషి చేస్తానన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల కరపత్రాల ద్వారా ఎమ్మెల్యే ఇంటింటా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు మోడెం సిద్దప్ప, నీలకంఠ, రామ్మూర్తినాయుడు, రామిశెట్టి కమలాకర్, రాటకొండ మధుబాబు, రఘుపతినాయుడు, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, మల్లికార్జుననాయుడు, కౌన్సిలర్ గాంధీ, నేత కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి

గాలివీడు, జులై 31(ప్రభాతవార్త):

అంగన్వాడీ పాఠశాలలకు వచ్చే చిన్నారులను చాలా జాగ్రత్తగా చూసుకోవాలని ఎంపీడీఓ చంద్రమౌళి పేరొ్కన్నారు. గురువారం మండంలోని నూలివీడు పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న అంగన్వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల పౌష్టికాహారాన్ని చిన్నారులకు క్రమం తప్పకుండా అందజేయాలని తెలిపారు ప్రతిరోజు ప్ర్తి ఒక్క పిల్లవాడు పాఠశాలకు వచ్చే విధంగా వారి తల్లిదండ్రులతో మాట్లాడి రప్పించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన పాఠశాల సమయాన్ని తూచా తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం విద్యార్థుల నమోదు వారి హాజరు వంటి వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.



## జాతీయ రహదారుల పనులపై మంత్రి జనార్ధన్ రెడ్డి

రాజంపేట, జూలై 31 ప్రభాతవార్త



కడప, అన్నమయ్య జిల్లాలలో జరుగుతున్న జాతీయ రహదారి పనులు సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. గురువారం ఒంటిమిట్ట హరిత హోటల్లో కడప రేణిగుంట జాతీయ రహదారి ప్రాజెక్టు మేనేజర్ వెంకటేష్ తో మంత్రి చర్చించారు. పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. పర్యావరణ, వన్యమృగ అనుమతులు వరకు వచ్చాయని అడిగారు. పనులు ఎప్పుడు ప్రారంభం ఈ అవకాశం ఉందని ప్రశ్నించారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంపై అవగాహన



ప్రొద్దుటూరు అర్బన్, జులై 31,ప్రభాతవార్త :

మండలంలోని గోపవరం గ్రామంలో వున్న శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గోపావరం పాఠశాలలో ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వ్యర్థాలను ఉపయోగకరమైన వస్తువులుగా మార్చే పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందడమే కాకుండా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పాఠశాల మరియు పరిసరాలను శుభ్రంగా, పర్యావరణహితంగా మార్చవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి.ఇందిర, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయురాలు సుధారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత చర్యలు చేపట్టాలి



దువ్వూరు, జూలై 31, ప్రభాతవార్త:

ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలోనూ ఆయా కార్యదర్శులు ప్రతి రోజు పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్న సింగపనల్లె గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ ఇంటిలో పనికిరాని వస్తువులను, ఇతర చెత్తాచెదారాలను ఎక్కడ పడితే అక్కడ వేయరాదని గ్రీన్ అంబాసీడర్లు వచ్చినప్పుడు వారికి అందజేయాలన్నారు. అలాగే రోడ్లపైన దిబ్బలు, చెత్తచెదారం ఎక్కువగా ఉందని అలా కాకుండా ఊరికి దూరంగా వేసుకోవాలన్నారు. పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యాశాఖ అధికారి నియామకం

దువ్వూరు, జూలై 31, ప్రభాతవార్త:

దువ్వూరు మండల విద్యాశాఖ అధికారి-1గా రమణయ్యను విద్యాశాఖ నియమించింది. గతంలో ఎంఈఓ పోస్టు ఇంచార్జ్‌ల పాలనలో ఉండగా ప్రస్తుతం రెగ్యులర్ ఎంఈఓగా రమణయ్యను నియమించారు. ఇంచార్జ్ ఎంఈఓగా ఉన్న పద్మలత నుండి గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మంచి బోధనతో విద్యను అందించేందుకు కృషి చేస్తానని, పాఠశాలలో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరిస్తాం అన్నారు. పలువురు ఉపాధ్యాయులు ఆయనను కలిసి అభినందించారు.

## పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

దువ్వూరు, జూలై 31, ప్రభాతవార్త:

మండల పరిధిలోని 25గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం 7234 మందికి 3కోట్ల 7లక్షల రూపాయలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండలంలోని 15గ్రామ సచివాలయాల పరిధిలో 124మంది సిబ్బందిని పింఛన్ల పంపిణీకి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 7గంటల నుండి సచివాలయ సిబ్బంది పింఛన్లను పంపిణీ చేస్తారని లబ్దిదారులు ఇళ్ల వద్ద ఉండి తీసుకోవాలన్నారు. భర్తకు పింఛన్ వస్తూ ఉండి మరణిస్తే నెల లోపే భార్యకు పింఛన్ ఇచ్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అందులో భాగంగా 124మందికి కూడ పింఛన్ పంపిణీ చేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

## ప్రతి ఒక్కరూ బీమా సౌకర్యం కలిగి ఉండాలి



గాలివీడు, జులై 31(ప్రభాతవార్త):

ప్రస్తుతం సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక బీమా సౌకర్యం కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గాలివీడు బ్రాంచ్ మేనేజర్ శేషం ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం తూముకుంట పంచాయతీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమంలో భాగంగా సామాజిక భద్రతా పథకాలైన పీఎంఎస్‌బివై, పీఎంఏపీవై వంటి పథకాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ బీమా కలిగి ఉండాలని తెలిపారు. బీమా వల్ల అనేక ప్రయోజనాలు కలవని తెలిపారు. బీమా లేని వారు బ్యాంకులో కానీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రంలో గానీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పెద్దరెడ్డయ్య, బ్యాంకు ఆఫీసర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## లే అవుట్ స్థలాల రెగ్యులరైజేషన్ కోసం

## ఓపెన్ ఫోరమ్

బద్వేల్ అర్బన్ ,జులై 31, ప్రభాతవార్త

బద్వేల్ పురపాలక సంఘం నందు అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు శుక్రవారం ఉదయం 11 గంటలకు మునిసిపల్ కార్యాలయం నందు జరుగు టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం సమావేశం కు హాజరయి తమ సందేహాలను నివృత్తి చేసుకో వచ్చనీ అనుష్క కమిషనర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలు పట్టణ ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు లేఅవుట్ రెగ్యులరైజేషన్ (ఎస్ఆర్ఎస్) పథకాన్ని జి.వో.ఎం.ఎస్.నెం. 134 ద్వారా అనధికారిక లేఅవుట్లను క్రమబద్ధీరకణ చేసుకునేందుకు ఆదేశాలు జారీ చేయడం జరిగినదన్నారు జూన్ 30, 2025 కి ముందు అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు ఎవారైనా జులై 26 తేది నుంచి 90 రోజుల్లోపు ఎల్ఆర్ఎస్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సదరు క్రమబద్ధీకరణ కొరకు ప్రస్తుత మార్కెట్ విలువ+ ప్రకారం 14 శాతం చార్జీలు(10 లేఔట్ ఓపెన్ స్పేస్ అందుబాటులో లేని ఎడల) మరియు లేఔట్ రెగ్యులరైజేషన్ చార్జీలు చెల్లించి క్రమ బద్ధీకరణ చేసుకోవచ్చుననీ తెలిపారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ (ఎస్ఆర్ఎస్) పథకానికి సంబంధించి ఎటువంటి సందేహాల కోసం బద్వేలు పురపాలక సంఘం నందు టౌన్ ప్లానింగ్ విభాగం నందు సంప్రదించగలరన్నారు

## అవాంఛనీయ సంఘటన పాల్పడితే

## కఠిన చర్యలు తప్పవు

### అర్బన్ సీఐ చాంద్ బాషా

పులివెందుల, జులై 31 (ప్రభాత వార్త):

మండల పరిధిలో జరుగునున్న జడ్పిటిసి ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ చాంద్బాషా అన్నారు. పులివెందుల మండలంలో జరగబోవు జడ్పిటిసి ఉప ఎన్నిక సందర్భంగా గురువారం పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐ తన సిబ్బందితో వెళ్లి ఈ. కొత్తపల్లి .ఎర్రపల్లి పల్లి నల్లపురెడ్డి పల్లి గ్రామంలో ప్రజలతో మమేకమై రాబోవు జడ్పిటిసి ఎలక్షన్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలందరూ తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో ఉపయోగించుకోవాలని వారికి కౌన్సిలింగ్ ఇచ్చినారు. అలాగే నాటుసారా. బెల్టు షాపులు మరియు మట్కా జూదము వంటి అసంగిక కార్యక్రమాల జోలికి వెళ్లకుండా ఉండాలని ఇందుకు ఎవరైనా అతిక్రమించిన ఎడల వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరు గుంపులుగా ఉండరాదని సభలు సమావేశాలు జరపరాదని తెలియజేసినారు



## అన్న దాత సుఖీ భవ పథకం పై ఆంక్షలు పెట్టవద్దు

వేంపల్లి: జులై 31 (ప్రభాత వార్త):

ఆలస్యంగా నైనా చంద్ర బాబు ప్రభుత్వం అన్న దాత సుఖీ భవ పథకాన్ని ఆగస్టు 2 నుంచి అమలు చేయాలని నిర్ణయించడం హర్షణీయం అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు.అదే సమయంలో ఈ పథకం అమలు పై ఆంక్షలు పెట్టవద్దని ప్రభుత్వానికి తులసి రెడ్డి సూచించారు.ప్రతి రైతుకు ఏటా రూ 20 వేలు ఆర్థిక సాయం చేస్తామని కూటమి పార్టీలు తమ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నాయి. ఆ ప్రకారమే అమలు చేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. 2024 25 ఆర్థిక సంవత్సరం లో ఈ పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సాయం చేయలేదు. ఆ మొత్తాన్ని కూడా రైతుల ఖాతాల్లో జమ చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే రూ 20 వేల ఆర్థిక సాయం చేయాలి. కౌలు రైతులకు కూడా ఈ పథకాన్ని అమలుచేయాలి. డీ కె టి భూముల రైతులకు వర్తింప చేయాలి. చుక్కల భూముల రైతులకు వర్తింప చేయాలి. 2024 జనవరిలో రైతు భరోసా కింద 53.58 లక్షల మంది రైతుల ఖాతాలో జమ అయింది. ప్రస్తుతం 46.50 లక్షల మంది రైతుల ఖాతాల లో మాత్రమే నగదు జమ చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. అనగా 7.08 లక్షల మంది రైతుల సంఖ్య తగ్గుతోంది.ఇది సమంజసం కాదు. లబ్ధి దారుల సంఖ్య తగ్గకూడదని తులసి రెడ్డి అన్నారు.

## వైకాపా అతిరథ నాయకులతో కలిసి జడ్పీటీసీ నామినేషన్

పులివెందుల,జూలై 31 , ప్రభాత వార్త:

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత మహారత నాయకులు పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి, డిప్యూటీ సిఎం అంజాద్ భాషా ,జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి , మేయర్ సురేష్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి , ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి లతో కలసి జిల్లా పరిషత్ కార్యాల యంలో పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి దివంగత నాయకుడు తుమ్మల మహేశ్వర్ రెడ్డి సతీమణి తుమ్మల ఉమాదేవి, తుమ్మల హేమంత్ రెడ్డి లు నామినేషన్ దాఖలు చేశారు .ఈ నామినేషన్ ను పార్టీ కార్యలయం నుంచి ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకా తరఫున పోటీ చేస్తున్న జడ్పిటిసి అభ్యర్థిని పులివెందుల మండల ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఉదయం పులివెందుల పట్టణంలోని ఎంపీ అవినాష్ రెడ్డి స్వగృహం నందు నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తరలివచ్చి వారి సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. వాటి పరిష్కారాన్ని కృషి చేస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు. అలాగే వైకాపు నాయకులు చిన్న రంగాపూర్ గ్రామానికి చెందిన మధు రెడ్డి కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమంలో ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైకాపు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థిని పై చేయి చేసుకున్న ఉపాధ్యాయురాలు

ప్రొద్దుటూరు అర్బన్, జులై 31, ప్రభాతవార్త :

యూనిఫాం వెనక్కు ఇవ్వలేదని విద్యార్థినిపై ఉపాధ్యాయురాలు చేయి చేసుకున్న ఘటన నడింపల్లి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం చోటు చేసుకుంది. విద్యార్థిని దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుచున్నది. పాఠశాలలో యూనిఫాం ఇచ్చిన తర్వాత ఆ విద్యార్థిని నడింపల్లి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చేరింది. తమ పాఠశాలలో తీసికొన్న యూనిఫాం తిరిగి ఇవ్వాలని దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు మరొక విద్యార్థితో చెప్పి పంపింది. యూనిఫాం ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన ఆ ఉపాధ్యాయురాలు గురువారం విద్యార్థిని చదువుతున్న పాఠశాలకు వెళ్లి తరగతి గదిలో విద్యార్థిని చంపపై కొట్టి వెళ్లిపోయింది. విద్యార్థిని ఏడుపు విన్న తరగతి గదిలోని ఉపాధ్యాయురాలు వచ్చి పరిశీలించగా విద్యార్థిని చెంపపై వాతలు కనిపించాయి. దీంతో ప్రధానోపాధ్యాయులు దృష్టికి విషయం తీసుకెళ్లింది. హెచ్ఎం ఉపాధ్యాయులు పై చర్యలు తీసుకోవాలని ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ స్పందిస్తూ శుక్రవారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయురాలుకు షోకాజ్ నోటీసులు అందిస్తున్నట్లు వివరించారు.

## సుపరిపాలన తొలి అడుగు



పోరుమామిళ్ల రూరల్, జూలై 31 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి రితీష్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఈ సంవత్సరంలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి గురువారం పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ ప్రతి ఇంటికి తిరిగి టిడిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వారికి వివరించారు. అనంతరం అయన మాట్లాడుతూ అమ్మ ఒడి ప్రజల్లో సూపర్ సక్సెస్ అయిందని అన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ అమలు చేస్తామని ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత ప్రయాణం ప్రభుత్వం అమలు చేస్తామన్నారు. మొదటి సంవత్సరం లోనే సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల గుంతలు పడిన రోడ్ల ను అన్నిటిని కూటమి ప్రభుత్వం వస్తానే వాటిని ప్యాచ్ వర్క్ లేసి బాగు చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో కి తీసుకెళ్లడంలో భాగంగానే ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ ఎంపిటిసి శెట్టెం ప్రతాప్, టిడిపి నాయకులు చెన్ను రమణ, పిండం ప్రసాద్, ధర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం

పీలేరు జూలై 31 ప్రభాతవార్త:

ఆటో ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని మొరవపడ్డిపల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాలు...మండలంలోని వేపులబైలుకు చెందిన ఎ. సురేష్ (45) తన ఆటోలో క్యాటరింగ్ చేయడానికి తలపులకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పీలేరుకు వస్తూ మార్గం మధ్యంలో జాండ్లకు చెందిన షేక్ షకీలా (35), రొంపిచెర్ల మండలం చిచ్చిలివారపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన ప్రభావతి (40) పీలేరుకు వెళ్లడానికి ఆటో ఎక్కారు. అయితే మొరవపడ్డిపల్లె వద్ద పీలేరు నుంచి తలపులకు వెళుతున్న ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కింద ఆటో పడి నుజ్జునుజ్జైంది. ఆటోలో ఉన్న సురేష్, షకీలా, ప్రభావతి తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదం తీవ్ర స్థాయిలో జరిగినా ఆటోలో ముగ్గురు ప్రాణాలతో బయటపడడంతో పెనుప్రమాదం తప్పింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.











